నీళ్ల చారు... సుద్ద అన్నం !

ఇదీ తెనాలి జిల్లా వైద్యశాలలో రోగులకు పెడుతున్న భోజనం

- చూద్దామన్నా కన్పించని మెనూ
- బాలింతలకు పౌష్టికాహారం అందని ద్రాక్షే
- చేసేది లేక అన్నదాన కేంద్రాలను ఆశ్రయిస్తున్న రోగులు


తల్లి పిల్లల వైద్యశాలలో భోజనం పెట్టించుకుంటున్న రోగుల కుటుంబ సభ్యులు

తెనాలి అర్బన్: నీళ్ల చారు.. సుద్దల అన్నం.. నీళ్ల మజ్జిగే జిల్లా వైద్యశాలలోని రోగులకు దిక్కుగా మారింది. వీటిని ప్రతిరోజు తినలేక రోగులు సమీపంలో తానా సంస్థ వారు ప్రతిరోజు పంపిణీ చేస్తున్న అన్నమే వారికి ఆసరాగా మారింది. జిల్లా వైద్యశాలలోని రోగులకు మంచి పౌష్టికాహారం అందించటం లేదని పలుమార్లు ఫిర్యాదులు వస్తున్నా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటం రోగులపాలిట శాపంగా మారింది.

పెద్ద ఆస్పత్రి!

తెనాలి జిల్లా వైద్యశాలలో రెండు వందల పడకలు ఉన్నాయి. అదే ఆవరణలో 100 పడకల తల్లిపిల్లల వైద్యశాల ఉంది. దానిలో ఉన్న రోగులకు ప్రతిరోజు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి సమయంలో


ఇంటి వద్ద తెచ్చిన భోజనాన్ని పెడుతున్న వృద్ధురాలు

సాక్షి విజిట్

భోజనం అందించేందుకు డైట్ కాంట్రాక్ట్‌ను 2005లో తాడిబోయిన భారతిదేవికి అప్పగించారు. అప్పటి నుంచి ఆమె రోగులకు భోజనం అందిస్తున్నారు. తెనాలి జిల్లా వైద్యశాలలో సగటున ప్రతిరోజు 250 మంది వరకు ఇన్ పేషంట్స్‌గా ఉంటారు. వీరందరికీ ప్రభుత్వం ఇచ్చిన మెనూ ప్రకారం కాంట్రాక్టర్ భోజనం పెట్టాల్సి ఉంటుంది.

అమలు కాని మెనూ

తెనాలి జిల్లా వైద్యశాలలోని రోగులకు సాధారణ మెనూను, బాలింతలకు హైప్రొటీన్ డైట్‌ను అందించాల్సి ఉంటుంది. అలాగే ఆరోగ్య శ్రీ కింద చేరిన రోగులకు జనని సురక్ష యోజన కింద మంచి డైట్‌ను అందించాల్సి ఉంది. ఇందుకుగాను ప్రభుత్వం సాధారణ డైట్ పెట్టినందుకు ఒక్కొక్కరికీ రోజుకు రూ.39, హైప్రొటీన్ డైట్‌కు రూ.56, జననీ సురక్ష యోజన రోగులకు రూ.100 చెల్లిస్తుంది. అయితే సదరు కాంట్రాక్టర్ ప్రతిరోజు ఉదయం ఉప్మాను రోగులకు అందిస్తున్నారనే ఆరోపణ ఉంది. అలాగే సాధారణ రోగులకు అన్నం, ఒక కూర, సాంబారు, ఉడకబెట్టిన కోడి గుడ్డు, మజ్జిగను మాత్రమే ఇస్తున్నారు. బాలింతలకు వీటితో పాటు ఒక అరటి పండు, పప్పుండ ఇస్తున్నారు. మిగిలిన ఆకుకూర, రాగి మాల్ట్, చిక్కటి పాలు, టమాటా బాత్, ఇడ్లీ, కట్ పొంగలి, కిచిడీ వంటివి కన్పించవనేది రోగుల మాట. ప్రతిరోజు నీళ్ల చారు, నీళ్ల మజ్జిగ, బెండకాయ పులుసు పెడుతున్నట్లు ఆరోపణ వినిపిస్తుంది. దీంతో జిల్లా వైద్యశాల, తల్లిపిల్లల వైద్యశాలలోని సగం మంది రోగులు కూడా దీనిని తినటం లేదు. శుక్రవారం 'సాక్షి' పరిశీలనలో మెటర్నటీ వార్డులో 24 మంది రోగులు ఉంటే కేవలం 12 మంది మాత్రమే వారి వద్ద భోజనం తీసుకున్నారు. వారిలో కొందరు కేవలం అన్నం తీసుకుని మిగిలిన వాటిని వద్దని చెప్పటం కన్పించింది. దీనిని బట్టి చూస్తే రోగులు భోజనం కోసం ఎన్ని అవస్థలు పడుతున్నారో గమనించవచ్చు.

ఆకలి తీరుస్తున్న తానా అన్నదాన కేంద్రం

తెనాలి జిల్లా వైద్యశాల ఆవరణలో తానా సంస్థ గతంలో అన్నదాన కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. దానిలో ప్రతిరోజు 100 మందికి భోజనాన్ని పెడుతున్నారు. వైద్యశాలలో రోగులకు అందిస్తున్న భోజనం బాగుండకపోవటంతో ఎక్కువ మంది తానా అన్నదాన కేంద్రం వద్ద బారులు తీరి భోజనం తీసుకుంటున్నారు. అంతేకాకుండా ఆసుపత్రిలోని రోగులకు ఉదయం 8 గంటలలోపు టిఫిన్, మధ్యాహ్నం 12 గంటలకు, రాత్రి 7 గంటలలోపు రోగులకు భోజనం అందించాల్సి ఉంది. కానీ రోగులకు టిఫిన్‌లు ఉదయం 9 గంటలకు, భోజనం గంట ఆలస్యంగా పెడుతుండటంతో రోగులు ఆకలికి తట్టుకోలేక ఇంటి వద్ద నుంచి భోజనం తెప్పించుకుంటున్నారు. మరికొందరూ బయట మెస్‌లను ఆశ్రయిస్తున్నారు. తెనాలి జిల్లా వైద్యశాలను ఉన్నతాధికారులకు పలుమార్లు తనిఖీలు చేసిన సమయంలో రోగుల నుంచి భోజనంపై అనేక ఫిర్యాదులు వస్తున్నాయి. కానీ అధికారులు ఏమి చేయలేని స్థితిలో ఉన్నారు. దీనికి కారణం సదరు కాంట్రాక్టర్ కోర్టులో దీనిపై కేసు వేయటమేనని అధికారులు తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రభుత్వ పాలకులు స్పందించి వెంటనే ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు అందించే డైట్ విభాగాన్ని ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


తానా అన్నదాన కేంద్రం వద్ద బారులు తీరిన రోగులు, వారి కుటుంబ సభ్యులు

దాతలు పెట్టే భోజనమే బాగుంది



మాది కొల్లిపర గ్రామం. మా మనుమరాలు డెలివరీ అయితే ఇక్కడే 9 రోజుల నుంచి ఉంటున్నాం. ఆస్పత్రిలో పెట్టే భోజనం చాలటం లేదు. అంతేకాకుండా ఒక కూర, రసం, మజ్జిగ ఇస్తున్నారు. అవి అంతగా బాగుండటం లేదు. దీంతో తానా అన్నదాన కేంద్రంలో ప్రతిరోజు భోజనం చేస్తున్నాం. అక్కడి భోజనం బాగుంటుంది.

–లక్ష్మి, కొల్లిపర

టెండర్లు నిలిచిపోయాయి



రోగులకు అందించే భోజనంపై తరచూ ఫిర్యాదులు వస్తున్న మాట వాస్తవం. డైట్ కాంట్రాక్టర్ గడువు ఎప్పుడో ముగిసిపోయింది. 2023లో నూతన టెండర్లు కూడా పిలవటం జరిగింది. కాంట్రాక్టర్ కోర్టులో కేసు వేయటం వల్ల ఆ ప్రక్రియ తాత్కాలికంగా నిలిచిపోయింది. ఉన్నతాధికారులకు మరోసారి డైట్ విషయంపై తెలియజేస్తాం. వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

–డాక్టర్ మజీదా బేగం, జిల్లా సమన్వయ కర్త, డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్


రోగులకు అందించే కూర

క్లుప్తంగా

ఆదర్శ నాయకుడు మాజీ సీఎం వైఎస్ జగన్



తెనాలిఅర్బన్: విలువలతో కూడిన రాజకీయాలు చేస్తూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందరికీ ఆదర్శప్రాయంగా నిలిచారని వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ నాయకుడు పిల్లి ప్రేమ్‌రాజ్ పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ పుట్టిన రోజు వేడుకలను చినరావూరులో శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. అక్కడ ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందాయని గుర్తు చేశారు. నేడు ఆ పరిస్థితి కనిపించడంలేదన్నారు. గోవతోటి ఎలీషా, నాగరాజు, రమణ, జశ్వంత్, సాయి, బన్ను, అఖిల్, బాబీ, రాఘవులు, తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పకు ప్రత్యేక పూజలు



తెనాలిఅర్బన్: ముత్తెంశెట్టిపాలెంలోని హరి హర పుత్ర అయ్యప్పస్వామి దేవస్థానంలో ఆదివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 18రకాల ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. బట్టు దుర్గారావు గురుస్వామి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సంజన ఫిజియోథెరపీ దశమ వార్షికోత్సవం



తెనాలి: స్థానిక గంగానమ్మపేటలోని సంజన ఫిజియోథెరపీ క్లినిక్ 10వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ), తెనాలి శాఖ అధ్యక్షుడు డాక్టర్ కె.అనిల్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నూతనంగా ఏర్పాటుచేసిన పీడియాట్రిక్ విభాగాన్ని ప్రారంభించారు. ఫిజియోథెరపిస్టు డాక్టర్ బండారు రవికాంత్, డాక్టర్ కాశీభట్ల విష్ణుప్రియ, డాక్టర్ హారిక, డాక్టర్ భానుశ్రీ, డాక్టర్ భాస్కర్, డాక్టర్ చందు, కంభం మణికంఠ, కంభం వంశీ సోమ్‌కుమార్, డాక్టర్ విజయ్, డాక్టర్ దినేష్ పాల్గొన్నారు.

అండర్ పాస్ నిర్మాణానికి వినతి



మంగళగిరి: నగర పరిధిలోని జాతీయ రహదారి వద్ద చినకాకాని రాజ్ కమల్ రోడ్డులో అండర్ పాస్ నిర్మించాలని రైతులు కోరుతున్నారు. ఈ మేరకు ఆదివారం గుంటూరులోని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కార్యాలయానికి వెళ్లి వినతి పత్రం అందేశారు. రైతు నాయకులు పోతినేని వెంకటేశ్వరరావు, మన్యం శ్రీనివాసరావు, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, పొన్నెగంటి కొండలరావు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

తాడేపల్లిరూరల్ : ఎంటీఎంసీ పరిధిలోని ఉండవల్లిలో ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. గుంటూరు కమిటీ అధ్యక్షుడు రౌతు శ్రీనివాసరావు మార్గశిర మాసం ఎంతో పవిత్రమైనదని తెలిపారు. దైవ భక్తితో గ్రంథ పఠనం, జ్ఞానం ఉండాలని ప్రబోధించారు. అనంతరం భగవద్గీత గ్రంథాలు పంపిణీ చేశారు. టీవీ కృష్ణారావు, బి. శివలింగం నాయక్, టి. బ్రహ్మం, పట్టాభి శ్రీను, జె.హరిబాబు, సుబ్బారావు, ఆదర్శ్, బి.విద్య, ఎస్కే దిల్‌షా, జయలక్ష్మి పాల్గొన్నారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

తాడికొండ: అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని, కేసు నమోదు చేసి ఘటన తాడికొండ మండలం నిడుముక్కల గ్రామంలో జరిగింది. పోలీసుల వివరాల మేరకు..నిడుముక్కల గ్రామంలో తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా సంచరిస్తున్న తలతోటి శేషయ్య అనే వ్యక్తి వద్ద 66 మద్యం సీసాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వైటల్ విస్కీ 10 క్వార్టర్లు, క్లాసిక్ బ్లూ 55 క్వార్టర్లు మద్యంతో పాటు అతని వద్ద ఉన్న రూ.800 నగదును సీజ్ చేసి ఎస్ఐ జోజి ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె.వాసు తెలిపారు.

విజ్ఞాన సర్వస్వం భగవద్గీత



తెనాలి: భగవద్గీత ఒక మతగ్రంథం కాదనీ, అది విజ్ఞాన సర్వస్వమని, వ్యక్తిత్వ వికాస పాఠమని ప్రముఖ ఆధ్యాత్మిక ఉపన్యాసకుడు బీకేఎస్ మూర్తి అన్నారు. భగవద్గీత నరనారాయణుల సంవాదంగా, గురుశిష్యుల సంవాదంగానూ వెల్లడించారు. అందులోని 12వ అధ్యాయం భక్తిభావాన్ని తెలియజేస్తుందనీ చెప్పారు. అందుకే ప్రపంచంలోని పలు దేశాల ప్రజలు భగవద్గీతను తెలుసుకుంటున్నారని వివరించారు. వాకర్స్ క్లబ్, తెనాలి సమావేశం ఆదివారం సాయంత్రం స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు గుత్తా వెంకటరత్నం అధ్యక్షత వహించారు. కార్యదర్శి కడియాల రవిబాబు స్వాగతం పలికిన సభలో సభ్యులు ఆనందయ్య, వెంకటేశ్వరరావు, మొవ్వా సత్యనారాయణ, రంగారావు, రాజేంద్రప్రసాద్, చేతన్‌రాజ్ పాల్గొన్నారు.

విద్యార్థినులకు పుస్తకాలు, దుప్పట్లు పంపిణీ



తెనాలి: పట్టణంలోని కాలేజీ విద్యార్థినుల వసతిగృహంలోని విద్యార్థినులకు తెనాలి నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జొన్నాదుల వెంకటేశ్వరరావు నేతృత్వంలో ఆదివారం పుస్తకాలు, దుప్పట్లు, నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. బీసీ సంక్షేమ వసతిగృహాల్లోని విద్యార్థుల సంక్షేమం కోసం గత ఏడేళ్లుగా సాయం అందచేస్తున్నట్లు ఈ సందర్భంగా చెప్పారు. జొన్నాదుల రాహుల్, అతడి మిత్రబృందం పవన్‌కుమార్, ప్రతాప్‌రెడ్డి, చెన్నకేశవులు ఈ సేవలను అందిస్తున్నారు. ఆదివారం కార్యక్రమంలో జొన్నాదుల వెంకటేశ్వరరావు, మిత్రబృందంతోపాటు బీసీ వెల్ఫేర్ అధికారి వి.భిక్షాలు, జొన్నాదుల శివరామకృష్ణ, వసతి గృహం వెల్ఫేర్ అధికారి గద్దం సరోజిని, హరిప్రసాద్, కోటేశ్వరరావు, శివప్రసాద్, నందిపాటి ప్రసాద్ పాల్గొన్నారు.

సుందర తెనాలి కలను సాకారం చేస్తాం

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న


సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ శేషన్న

తెనాలిఅర్బన్: సుందర తెనాలి కలను సాకారం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పేర్కొన్నారు. పట్టణంలోని 15వ వార్డు గౌడకాలనీ, గురవయ్య కాలనీలో ఆదివారం ఆయన పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. రోడ్లపై అక్కడక్కడ మట్టి దిబ్బలు ఉండటతో వాటిని వెంటనే తొలగించాలని ఆదేశించారు. ప్రతి రోజు చెత్తను నూరుశాతం సేకరించాలని సూచించారు. వైఎస్సార్ సీపీ 15వ వార్డు కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో చినరావూరు పార్కును ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. పార్కులో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని, తన హయాంలో ఇవన్నీ పూర్తికావడం సంతోషకరమని చెప్పారు. పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

మది దోచిన 'అన్నమయ్య కీర్తనల గీతాంజలి'


గానాలాపన చేస్తున్న డాక్టర్ కె.పురుషోత్తమరావు

తెనాలి: దక్షిణ భారత దేశమంతటికీ తొలి వాగ్గేయకారుడు తాళ్లపాక అన్నమాచార్యుడు...సంస్కృత వేదాల్లోని సారాన్నంతా అలతి అలతి తెలుగు పదాలతో పాడి, జాతికి సందేశం అందించి కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీవేంకటేశ్వరస్వామిని ఆరాధించిన ద్రవిడాగమ సార్వభౌముడు అన్నమయ్య అని ప్రముఖ కవి పొన్నపల్లి గోపాలకృష్ణమూర్తి అన్నారు. పట్టణానికి చెందిన సాంస్కృతిక సంస్థ సంకీర్తన ఆధ్వర్యంలో 8వ వార్షికోత్సవ 'అన్నమయ్య కీర్తనల గీతాంజలి' ఆదివారం సాయంత్రం స్థానిక తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో నిర్వహించారు. పల్లవి, చరణాలతో కూడిన పాటకు ప్రాణంపోసి, స్పష్టమైన రూపాన్ని కల్పించి, సంకీర్తనా స్వరూపాన్ని ఆంధ్రజాతికి అనుగ్రహించిన అన్నమాచార్య పదకవితా పితామహుడైన విధానాన్ని గోపాలకృష్ణమూర్తి వివరించారు. సహచర గాయకులతో కలిసి అన్నమయ్య కీర్తనలను ఏటా గానంచేస్తూ ప్రజలకు వాటిలోని అర్థాన్నీ, పరమార్థాన్నీ వీనులవిందుగా వినిపిస్తున్న సంకీర్తన సంస్థను ఆయన అభినందించారు. ఆంధ్రప్రదేశ్ రవాణా, రోడ్లు, భవనాల ప్రిన్సిపల్ కార్యదర్శి కాంతిలాల్ దండే ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. సంకీర్తన వ్యవస్థాపకుడు డాక్టర్ కె.పురుషోత్తమరావుతో తన సాన్నిహిత్యాన్ని గుర్తు చేసుకుంటూ, ఆయన చేస్తున్న సంగీత కళాసేవను అభినందించారు. డాక్టర్ కె.పురుషోత్తమరావు, దివ్యశ్రీ, సుచరిత, శ్రీకాంతి ప్రాజ్ఞేశ్వర లక్ష్మి, రత్న ప్రియాంక, దేవీలలిత, వైష్ణవి, ఆంజనేయశాస్త్రి అన్నమాచార్య కీర్తనలను రాగయుక్తంగా శ్రావ్యంగా ఆలపించారు. ప్రేక్షకుల అభినందనలు అందుకున్నారు. ఆంజనేయశాస్త్రి, శ్రీనివాస్‌లు వయొలిన్‌పై, వెంకటేశ్వరరావు కీబోర్డ్, నాగప్రసాద్ తబలా, జగన్మోహిని మృదంగం, కుమార్‌బాబు వేణువు, లక్ష్మీశంకర్ మోర్సింగ్, కిషోర్ ఘటంపై వాయిద్య సహకారం అందించారు. డిజిటల్ స్క్రీన్‌పై ప్రదర్శించిన శ్రీవేంకటేశ్వరస్వామి చిత్రాలు ప్రత్యేకాకర్షణ. అన్నమాచార్య కీర్తనలు ప్రాచుర్యానికి కృషిచేస్తున్న గురువులు కొండపి వసుంధర, యల్లాప్రగడ జానకి, పొత్తూరి వెంకట ఆదిలక్ష్మి, కృత్తివెంటి కమల, సాల్లేటి శైలజ, గౌరావఝుల ఆంజనేయశాస్త్రిలను ఘనంగా సత్కరించారు. డాక్టర్ సుజాత స్వాగతం పలికారు. పొన్నపల్లి వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

ఆర్గనైజేషన్‌కు గుర్తింపు ఇవ్వండి


ఐక్య వేదికపై నాయకులు

తాడేపల్లిరూరల్ : మాలల ఆర్గనైజేషన్‌కు గుర్తింపు ఇవ్వాలని మాల ఉద్యోగుల సంఘం నాయకులు మల్లెల వెంకటరావు, నూతలపాటి జగదీష్ కోరారు. ఆదివారం తాడేపల్లి బ్రహ్మానందపురంలో రాష్ట్ర మాల ఉద్యోగస్తుల ఐక్య వేదిక సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లెల వెంకటరావు, నూతలపాటి జగదీష్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో మాల కులానికి సంబంధించి 15 మంది ఎమ్మెల్యేలు, నలుగురు ఎంపీలు ఉన్నారన్నారు. వారి వల్ల తమకు ఉపయోగం లేదని, ఈ సమావేశానికి తమ ఎమ్మెల్యేలను, ఎంపీలను ఆహ్వానించామన్నారు. కానీ ఒక్కరూ రాలేదని, తాము ఓట్లు వేస్తే నెగ్గి, తమ సమస్యలపై మాట్లాడకుండా వారి ప్రాధాన్యతను తగ్గించుకున్నారన్నారు. ఎస్సీ ఎస్టీ ఉద్యోగులను ప్రభుత్వాలు వేధిస్తున్నాయని, తమ గళం వినిపించేందుకు ఎస్సీ ఎస్టీ ఆర్గనైజషన్స్‌కు గుర్తింపు ఇవ్వకుండా చేస్తున్నారని ఆరోపించారు. ఉద్యోగాల ప్రమోషన్‌లో తమ వాటాలు తమకు ఇవ్వకుండా వేరే వారికి ఇస్తున్నారని, ఇదేమని ప్రశ్నించిన ఎస్సీ ఉద్యోగులను సస్పెండ్ చేసి ఏసీబీ ట్రాప్ చేసి వేధిస్తున్నారని మండిపడ్డారు. ఏసీబీ రైడ్‌లు కేవలం ఒక్క ఎస్సీ వర్గ ఉద్యోగులపై మాత్రమే జరుగుతున్నాయని, మిగతా వర్గాలపై ఎందుకు జరగవని ప్రశ్నించారు.

ఆకట్టుకున్న గోవిందనామ కోలాట ప్రదర్శన



తెనాలి: పట్టణంలోని శ్రీసాయిరాం సంగీతలహరి – కోలాట భజనమండలి సంగీత గురువు వఝుల లక్ష్మీసునీత ఆధ్వర్యంలో గల నలభై రోజులుగా గోవింద నామాలు, కోలాటం నేర్చుకుంటున్న 108 మంది చిన్నారులు ఆదివారం పట్టణంలో కోలాట ప్రదర్శన నిర్వహించారు. బోసురోడ్డులోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ప్రాంగణం నుంచి హనుమాన్‌చౌక్‌లోని చిట్టి ఆంజనేయస్వామి ఆలయం వరకు చిన్నారులు ప్రదర్శించిన గోవిందనామ కోలాట ప్రదర్శన ఆకర్షణీయంగా సాగింది. ఈ చిన్నారుల బృందాన్ని ఈనెల 26న తిరుమలకు తీసుకెళ్లి, 27న తిరుమల ఆస్థాన మండపంలో గోవిందనామ సంకీర్తన చేయిస్తామని, కోలాట ప్రదర్శన ఉంటుందని నిర్వాహకులు వఝుల లక్ష్మీసునీత తెలియజేశారు. కొండపి శ్రీనివాసరావు, కడియాల సునీల్ కుమార్, దీపాల నాగమహేశ్వరరావు, జొన్నలగడ్డ సూర్యనారాయణమూర్తి, కోలాటం మాస్టర్ ప్రసాద్ పాల్గొన్నారు.

మాస్టర్ ప్రింటర్స్ అసోసియేషన్ సమావేశం



తెనాలి: ఏపీ మాస్టర్ ప్రింటర్స్ అసోసియేషన్, తెనాలి శాఖ ఆత్మీయ సమావేశం ఆదివారం కొత్తపేటలోని దేవీప్రియ ఫంక్షన్‌హాలులో నిర్వహించారు. సమావేశంలో ఎన్నికైన నూతన కమిటీని పరిచయం చేశారు. అసోసియేషన్ ఆర్థికంగా బలపడటానికి సభ్యుల సలహాలను తీసుకున్నారు. సంఘ సమస్యలపైనా చర్చించారు. అసోసియేషన్ అధ్యక్షుడు డి.అమరనాథ్, కోశాధికారి ఎస్వీ ఉమామహేశ్వరరావు సభ్యులకు ధన్యవాదాలు తెలియజేశారు.

శ్రమయేవ జయతే పురస్కారం ప్రదానం



తెనాలిఅర్బన్: పసుపులేటి కోటేశ్వరరావు, తులశమ్మ స్మారక కమిటీ వ్యవస్థాపకుడు తన్నీరు శివశంకర్ ఆధ్వర్యంలో ఫ్రెండ్స్ ఇంజినీరింగ్ వర్క్స్ అధినేత షేక్ మొహిద్దీన్, సెంట్రింగ్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు మట్టుపల్లి సాంబయ్యలకు శ్రమయేవ జయతే పురస్కారాలను గాంధీనగర్‌లోని ఇస్కాన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆదివారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా తన్నీరు శివశంకర్ మాట్లాడుతూ వివిధ రంగాల్లో పనిచేస్తూ ఉన్నత స్థితికి చేరిన వారిని గుర్తించి అవార్డులు ప్రదానం చేస్తున్నామని తెలిపారు. మర్రెడ్డి బసివిరెడ్డి, ఈఎల్‌వీ అప్పారావు, డాక్టర్ తన్నీరు కళ్యాణ్‌కుమార్, పసుపులేటి మల్లిఖార్జునరావు, పసుపులేటి వినోద్, మాలేపాటి హేమకుమార్, గరికపాటి రామమోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ నృత్య నీరాజనంలో తెనాలి చిన్నారుల ప్రతిభ

స్వర్ణ నంది, సరస్వతి, నటరాజు, నందీశ్వర అవార్డుల ప్రదానం


దైవజ్ఞశర్మచే బహుమతులను అందుకుంటున్న డాక్టర్ బాలత్రిపురసుందరి, శిష్యబృందం

తెనాలి: హైదరాబాద్‌లోని ఆదర్శ కళానిలయం ఆదివారం నిర్వహించిన శాస్త్రీయ నృత్యనీరాజనంలో తెనాలికి చెందిన నృత్యగురువు, కళాణి కూచిపూడి ఆర్ట్స్ అకాడమీ అధినేత డాక్టర్ చల్లా బాలా త్రిపుర సుందరి, శిష్యబృందం చేసిన నృత్యాంశాలు ఆకట్టుకున్నాయి. అక్కడి డాక్టర్ దేవులపల్లి రామానుజరావు కళామందిర్‌లో ఉదయం 9 గంటల్నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరిగిన ప్రదర్శనలో మొత్తం 16 మంది నృత్యవిద్యార్థినులు శివతాండవం, అన్నమాచార్య కీర్తనలు వంద నాట్యాలుగా ప్రదర్శించారు. తమ నృత్యాభినయంతో అందరి ప్రశంసలు అందుకున్నారు. ప్రముఖ ఆధ్యాత్మిక గురువు, సరస్వతి ఉపాసకుడు దేవజ్ఞ శర్మ చేతులమీదుగా 13 మంది విద్యార్థులకు స్వర్ణ నంది ఇద్దరికీ సరస్వతి, ఒకరికి నటరాజు, నందీశ్వర అవార్డులను ప్రదానం చేశారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు


ఆర్టీసీ డిపోలో కేక్ కట్ చేస్తున్న డీఎం రాజశేఖర్

తెనాలిఅర్బన్: నిన్నువలె నీ పొరుగు వారిని ప్రేమించు అన్న బైబిల్ వాక్యాన్ని అందరూ ఆచారించాలని పాస్టర్ చిలువూరి నతానియేలు పేర్కొన్నారు. సుల్తానాబాద్‌లోని కుమార్‌పంప్స్ ఫ్యాక్టరీలో సెమీ క్రిస్మస్ వేడుకలను శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ నతానియేలు చిన్నారులచే కేక్‌ను కట్ చేసి అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో వాసుబాబు, గడ్డిపాటి చిట్టిబాబు, కొత్త కృష్ణకుమార్, హరిబాబు, తాడిబోయిన సత్యనారాయణ, వాసుదేవుడు, పినపాటి సేతుబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల ఆధ్వర్యంలో...

ఏసుక్రీస్తు అనుసరించిన జీవన విధానాన్ని తమజీవితంలో అనుభవించుకుని నడుచుకోవాలని తెనాలి ఆర్టీసీ డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్ సూచించారు. ఆర్టీసీ ఉద్యోగుల ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. పాస్టర్ వి.సురేష్ క్రిస్మస్ సందేశాన్ని అందించారు. కేక్‌ను ఆయన కట్ చేసి అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ఐజీ ప్రసాద్, అసిస్టెంట్ ఇంజనీర్ ఎస్.అధిరామ్ నాయక్, వివిధ ఉద్యోగ సంఘ నాయకులు ఐ.రాజేష్‌ఖన్నా, ఎస్.ప్రసాద్, డి.సుధాకర్, విజయ్ కుమార్, జోషిబాబు, నరసింహారావు, సారామ్మ, పద్మావతి, ప్రసన్న జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

జైభీమ్ ఫెడరేషన్ కార్యాలయంలో..

జైభీమ్ ఫెడరేషన్ కార్యాలయంలో సెమీక్రిస్మస్ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు కవెవరపు దేవానంద్ కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మార్పీఎస్ నాయకులు కిన్నెర నాగరాజు, కొత్తపల్లి రామారావు, సయ్యద్ ఆషా, కవెవరపు రవి కుమార్, రాణి, తదితరులు పాల్గొన్నారు.


కుమార్‌పంప్స్ ఫ్యాక్టరీలో జరిగిన సెమీక్రిస్మస్‌లో కేక్ కట్ చేస్తున్న చిన్నారులు


జైభీమ్ ఫెడరేషన్ కార్యాలయంలో క్రిస్మస్ కేక్ కటింగ్